క్లుప్తంగా

4 కిలోల గంజాయి పట్టివేత

ఆరిలోవ: ఆరిలోవ పోలీసులు శుక్రవారం ఇద్దరు యువకుల నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బీఆర్‌టీఎస్‌లో ముడసర్లోవ పార్కు సమీపంలో శుక్రవారం ఉదయం ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా... అదే సమయంలో చినగదిలి ప్రాంతానికి చెందిన నక్క లోకేష్ అలియాస్ కిట్టు, కొంగరాని ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై సింహాచలం వైపు నుంచి హనుమంతవాక వెళ్తున్నారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకొన్నారు. వీరిద్దరూ అరకులో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి ఆరిలోవ తీసుకొచ్చినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వీసీగా ప్రసాదరెడ్డిని నియమించాలని ప్రత్యేక పూజలు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మురళీ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా మరోసారి ఆచార్య ప్రసాదరెడ్డి నియమితులు కావాలని కోరుతూ కరకచెట్టు పోలమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఏపీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మురళీ శుక్రవారం తెలిపారు. అనంతరం అతని నియామకం కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించామన్నారు. పూర్వ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో నాలుగున్నరేళ్లలో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నాక్ ఉత్తమ ర్యాంకింగ్ లభించిందన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి వీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్‌ను ప్రోత్సహించేందుకు బహుమతులు

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని వుడాపార్క్‌లో ఉన్న సీ షోర్ వాకర్స్ క్లబ్ సభ్యులను మరింత ప్రోత్సహిస్తూ వారిలో ఆరోగ్యంపై అవగాహన, వాకింగ్ పట్ల ఆసక్తిని పెంచే విధంగా ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సాయి ప్రతాప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.పెదసోములు తన సొంత నిధుల నుంచి రెండు రకాల బహుమతులను సభ్యుల కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జనరల్ బాడీ మీటింగ్‌లో పాల్గొనడం, సమయపాలన, సంస్థ కార్యక్రమాలలో చురుకైన భూమిక పోషించే వారిని గుర్తించి మెదటి ముగ్గురికి నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. బోర్డ్ మీటింగ్‌లో చురుగ్గా పాల్గొనే సభ్యులకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్యానికి జిమ్‌దాబాద్

- ఓపెన్ జిమ్‌లతో ఆహ్లాదం, ఆరోగ్యం..!
- ఎంవీపీ కాలనీ 12 సెక్టార్లలో ఏర్పాటు
- ఒక్కోదానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వ్యయం
- ప్రత్యేక ఆకర్షణగా లుంబిని పార్కు, బుద్ధవనం, బృందావనం
- వ్యాయామానికి సద్వినియోగం చేసుకుంటున్న నగరవాసులు



బృందావనం పార్కులో కార్బన్ ఫ్లోరింగ్‌తో కూడిన ఓపెన్ జిమ్ సముదాయం



ఎంవీపీ సెక్టార్ - 12లో ఓపెన్ జిమ్





ఎంవీపీ సెక్టార్ - 2 రాజీవ్ పార్కులో ఓపెన్ జిమ్



బుద్ధవనంలో ఓపెన్ జిమ్ సముదాయాన్ని వినియోగించుకుంటున్న సందర్శకులు

ఎంవీపీ కాలనీ: ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్యోగ పరిరక్షణకు అనేక చర్యలు చేపడుతోంది. జగన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అన్ని రకాల చికిత్సలు అందిస్తోంది. దీంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు నగరాల్లో పెద్ద ఎత్తున పార్కులు అభివృద్ధి చేస్తోంది. ఉరుకులు పరుగుల సిటీ జీవితంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు సేదతీరేలా పెద్ద ఎత్తున సౌకర్యాలు కల్పించింది. పార్కుల అభివృద్ధిపై జీవీఎంసీ దృష్టి సారించడంతోపాటు ఆయా పార్కుల్లో జనసాంద్రత కలిగిన ప్రాంతాల్లో, గ్రీన్ బెల్ట్ ఏరియాలో ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంవీపీ కాలనీలో 12 సెక్టార్లలో ఓపెన్ జిమ్‌లు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వ్యయంతో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయా జిమ్‌లు నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచుతుండడంతోపాటు ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేస్తున్నాయి.

పార్కుల్లో ప్రత్యేకంగా..

ఎంవీపీ కాలనీ పరిధిలో జీవీఎంసీ ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కుల్లో ఈ ఓపెన్ జిమ్‌లు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రూ.10 నుంచి రూ.15 లక్షల వ్యయంతో ఆయా పార్కుల్లో జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. అప్పుఘర్‌లోని లుంబినీ పార్కులో సందర్శకులను ఆకట్టుకునే విధంగా పూర్తి గ్రీనరీ లాన్‌తో కూడిన ప్రత్యేక ఓపెన్ జిమ్ అందుబాటులోకి తెచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ జిమ్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. దీంతోపాటు సెక్టార్ - 6లోని కైలాసగిరి కొండను ఆనుకొని బుద్ధవనంలో అన్ని రకాల పరికరాలతో కూడిన ఓపెన్ జిమ్ సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో సందర్శకులు ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున ఈ జిమ్ సేవలను వినియోగించుకుంటున్నారు. అదేవిధంగా ఎంవీపీ సెక్టార్ - 11లో నూతనంగా ఆధునికీకరించిన బృందావనం పార్కులో ఓపెన్ జిమ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పూర్తి కార్బన్ ఫ్లోరింగ్ సముదాయంలో జిమ్ పరికరాలు అందుబాటులో ఉంచడంతో కార్పొరేట్ జిమ్‌లకు దీటుగా ఇక్కడ వ్యాయామం చేసుకునేందుకు నగర వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో పనుల అడ్డగింత



రైల్వేకు కేటాయించిన భూమిలో ట్రెంచ్ తవ్వుతున్న జీవీఎంసీ జేసీబీ



స్థానికులను పనుల వద్దకు రాకుండా రక్షణగా నిలిచిన పోలీసులు

- ఆందోళనకు దిగిన గిరిజనులకు సర్దిచెప్పి కొనసాగింపు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో గిరిజనులు ఆందోళనకు దిగారు. తమ భూమిలో ఎలాంటి పనులు చేయొద్దంటూ అధికారులను అడ్డుకున్నారు. జీవీఎంసీ ఏసీపీ శాస్త్రి, ద్వారకా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ఎదురుగా కొన్ని ఎకరాల భూమిని సేద్యం కోసం దశాబ్దాల క్రితం ఇక్కడ కొంతమంది గిరిజనులకు ప్రభుత్వం కేటాయించింది. అనంతరం గత ప్రభుత్వం ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఖాళీగా ఉండటంతో రెవెన్యూ శాఖ జీవీఎంసీకి అప్పగించింది. దీనిలో 53 ఎకరాలను రైల్వే శాఖకు కేటాయించింది. ఈ భూమికి హద్దులు వేసి రైల్వే అధికారులకు అప్పగించడానికి శుక్రవారం జీవీఎంసీ జోన్-2 ఏసీపీ శాస్త్రి, సిబ్బందితో వెళ్లి పనులు చేపట్టారు. జేసీబీలతో ట్రెంచ్ తవ్వించి ఫెన్సింగ్ వేయించి హద్దులు ఏర్పాటు చేయదలిచారు. ఇంతలో శ్రీకృష్ణాపురం గిరిజనులు అక్కడకు చేరుకుని ఆ భూమి తమదేనని, తాము వ్యవసాయం చేసుకోవడానికి గతంలో ప్రభుత్వం ఇచ్చిందంటూ అడ్డుకున్నారు. వెంటనే జీవీఎంసీ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ద్వారకా ఏసీపీ, ఆరిలోవ సీఐ సోమశేఖర్, సిబ్బంది అక్కడకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. ఏమైనా ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు చూపించి సమస్య పరిష్కరించుకోవాలని ద్వారకా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఇక్కడ భూమి పూర్తిగా జీవీఎంసీకి చెందినదని, దీనిలో 53 ఎకరాలు రైల్వేకు కేటాయించినట్లు జోన్ -2 ఏసీపీ తెలిపారు. అనంతరం అధికారులు ట్రెంచ్ పనులు కొనసాగించారు.

కమిటీ క్లబ్ శ్లాబ్ నిర్మాణానికి శంకుస్థాపన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని న్యూ పితాని వీధి గ్రామం కమిటీ క్లబ్ పైన శ్లాబ్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సొంత నిధులతో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి ప్రభుత్వం, ఎంవీవీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు.

నగరంలోకి భగత్‌సింగ్ జన్ అధికార్ యాత్ర

ఎంవీపీ కాలనీ: వివిధ స్వతంత్ర, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర విశాఖపట్నం చేరుకుంది. డిసెంబర్ 10న కర్ణాటకలో ప్రారంభమైన ఈ యాత్ర మార్చి 3న ఢిల్లీలో ముగుస్తుంది. 13 రాష్ట్రాల్లో 80 జిల్లాల మీదుగా 8,500 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగింది. ప్రజల మౌలిక హక్కులైన విద్య, వైద్యం, ఉపాధి, వసతి అంశాల్లో సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు స్వతంత్ర సంస్థలు, ప్రజా సంఘాలు ఈ యాత్ర చేపట్టాయి.

స్కూల్ గేమ్స్ క్రికెట్‌లో ఏయూ స్కూల్ విద్యార్థి ప్రతిభ



పీకేవీ లక్ష్మీ నారాయణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పి.కె.వి. లక్ష్మీ నారాయణ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. నంద్యాలలో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అండర్-14 క్రికెట్ టీం తరపున పోటీల్లో పాల్గొన్నారు. వీరి బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, పాఠశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.సుభాషిణి తదితరులు అభినందించారు.

లైంగిక దాడుల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

ఎంవీపీ కాలనీ: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడుల నివారణకు స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ పని, ఉద్యోగ ప్రదేశాల్లో మహిళలకు పూర్తి స్నేహ పూర్వక వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏయూ డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టి.సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థినులు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలో, బయట వ్యక్తులు అనుమానాస్పదంగా, అనుచితంగా ప్రవర్తించినా తక్షణమే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తూ లైంగిక దాడులకు, వేధింపులకు గురికాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.అప్పారావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సిద్ధమవ్వాలి



ప్రశంసా పత్రాలతో సిబ్బంది, ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ : ఎన్నికల విధుల కోసం ఆర్మ్‌డ్ రిజర్వ్‌డు పోలీసులు సిద్ధంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆదేశించారు. కై లాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహించడంలో మెరుగైన పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బందికి ఆయన ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏఆర్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు.

21న అపూర్వ సమ్మేళనం

బీచ్‌రోడ్డు: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారా శిక్షణ పొంది ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉన్నతమైన ఉద్యోగాలు పొందిన వారితో ఈ నెల 21న అపూర్వ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ ట్రెనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ సలహాదారు శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సమ్మేళనం నిర్వహించబోయే ప్రదేశం వుడా చిల్డ్రన్ ఎరీనాను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కలలను సాకారం చేసేందుకు ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని చాలా మంది ఉన్నతమైన ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. సీడాప్ సీఈవో ఎం.కె.వి శ్రీనివాసులు మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్య 66,125 మంది శిక్షణ పొందితే 44,749 మంది స్థిరపడ్డారన్నారు. 21న నిర్వహించే కార్యక్రమానికి వారు అందరూ హాజరవుతారని చెప్పారు.

31న ఆత్మీయ సమ్మేళనం

సీతమ్మధార: వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న ముడసర్లోవ రోజ్ గార్డెన్స్‌లో రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి తెలిపారు. ఉదయం 9.30 నుంచి ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, తంబులా, ప్రతిభ గల విద్యార్థులకు అతిథులచే స్కాలర్‌షిప్, పోటీల విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. వివరాలకు 90306 55681 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



పైనాపిల్‌కాలనీలో పాదయాత్ర చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే **నియోజకవర్గంలో** పాదయాత్ర చేపట్టినట్లు విశాఖ **ఎంపీ, తూర్పు** నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమ**న్వయకర్త ఎంవీవీ** సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ధారపాలెంలో బంగారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసిన తర్వాత వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి జీఎన్ఎస్‌యూఆర్ఎం కాలనీ, పైనాపిల్‌కాలనీ, కామాక్షినగర్, రామకృష్ణాపురం, దీనదయాల్‌పురంలలో యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ఎంవీవీకి మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. పైనాపిల్‌కాలనీలో నీటి సమస్య, వీధి దీపాలు సమస్య, రామకృష్ణాపురంలో శాశ్వత శ్లాబుల సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని, వెంటనే పరిష్కరించడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య ఉందని, కుళాయిలు సకాలంలో రావడంలేదని, వీధి దీపాలు సరిగా వెలగడంలేదని మొదటిరోజు పాదయాత్రలో ఎక్కువ మంది తన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ పాదయాత్ర నియోజకవర్గంలో 60 రోజులపాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్ల అప్పారావు, మత్స్యకార సంక్షేమ విభాగం చైర్మన్ పేర్ల విజయ చందర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, అయ్యారెకల కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్ పాత్రుడు, స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, కె.సుబ్బారావు, శ్రీనివాసరావు, డేవిడ్, శిరీష, సాగరిక, వెంకటరెడ్డి, బాబూరావు, గోవింద్ పాల్గొన్నారు.

బీచ్‌ను శుభ్రం చేయించాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పన్నెండో వార్డులో గెడ్డ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం బీచ్‌లో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఆయన శుక్రవారం జోన్-2 పరిధిలో పలు వార్డుల్లో పర్యటించారు. మొదట తొమ్మిదో వార్డులో జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్‌లలో స్థానిక కార్పొరేటర్ స్వాతి, అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని కార్పొరేటర్ ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన ఆయన ఆయా స్థలాలను పరిశీలించారు. వాటిపై తనకు నివేదిక అందజేయాలని జెడ్సీకి సూచించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు షెడ్, రజకుల కుల వృత్తికి దోబీఖానా నిర్మించాలని కార్పొరేటర్ కోరారు.

కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వండి

12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, అధికారులతో కలిసి కమిషనర్ సాయికాంత్ వర్మ టీఐసీ పాయింట్, కనకదుర్గానగర్, అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో కాలువలు, గెడ్డలను పరిశీలించారు. వాటిని శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక నిర్మాణంలో ఉన్న సామాజిక భవనం పనులు మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ తీసుకెళ్లారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు అప్పగించిన కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసు ఇవ్వాలని కార్యనిర్వాహక అధికారి శాంసన్ రాజును ఆదేశించారు. నిర్ణీత సమయంలో కాంట్రాక్టర్ పనులు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో జీవీఎంసీ అధికారులు, వైస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.


వాతావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సు



కాలుష్యాన్ని గణించే వాహనాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ అధ్యయనశాస్త్ర విభాగాన్ని జవహర్ నవోదయ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. 15 మంది విద్యార్థులతో కూడిన బృందానికి ప్రయోగశాల, విభాగ ప్రత్యేకతలను విభాగాధిపతి ఆచార్య పి.సునీత వివరించారు. తుపానులు ఏర్పడటం, వాటి గమనం, ప్రభావం, రుతువుల మార్పు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. వాతావరణ, సముద్ర సంబంధంగా విభాగంలో జరుగుతున్న పరిశోధనలు, వాటి ప్రగతిని విద్యార్థులకు తెలిపారు. పరిశోధన రంగంలో అడుగిడే దిశగా విద్యార్థులు తమ ప్రతిభతో ముందుకు సాగాలని సూచించారు. సోలార్ రేడియేషన్, గాలి వేగం - దిశ, వాతావరణ పీడనం, లవణీయత, రిప్ కరెంట్ వంటి అంశాలను విద్యార్థులకు విశదీకరించారు. అనంతరం విభాగంలో ఉన్న కాలుష్య శాతాన్ని గణించే పరికరాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. పుస్తక జ్ఞానానికి భిన్నంగా ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బీచ్‌రోడ్డు: ఇండస్ ఆస్పత్రి ప్రమాదాన్ని మరచిపోక ముందే మరో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటన చోటుచేసుకుంది. మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... ఒక ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న నాన్సీ అనే మహిళ ఇద్దరు పిల్లలతో రామ్‌నగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఆమె ఉద్యోగానికి వెళ్లగా ఇంట్లో పిల్లలు ఉన్నారు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని పుస్తకాలు, సామాన్లు దగ్ధమైనట్లు తెలిపారు.

కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

బీచ్‌రోడ్డు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో శని, ఆదివారాల్లో జరగబోయే కవి సమ్మేళనం పోస్టర్‌ను సాహితీవేత్త డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష కోసం శ్రీశ్రీ కళావేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తివాడ శ్రీకాంత్, బాబయ్య, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు స్ఫూర్తిప్రదాత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

బీచ్‌రోడ్డు: అమరజీవి పొట్టి శ్రీరాములు స్థిత ప్రజ్ఞుడని, అకుంఠిత దీక్షతో మొక్కవోని ధైర్యంతో ఆంధ్రరాష్ట్రం కోసం పరితపించిన మహానుభావుడని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు కొనియాడారు. స్థానిక వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏయూ సంయుక్తంగా పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంబంధాల కంటే మానవ సంబంధాలు బలమైనవని నమ్మిన ఆయన తన యావదాస్తిని సంఘ పరం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య గోవాడ వీర్రాజు, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య అనురాధ, ఆచార్య వెలమల సిమ్మన్న, ప్రజా గాయకుడు దేవిశ్రీ తదితరుల పాల్గొన్నారు.